

రంజాన్ వేళలు

ఇఫ్తార్(గురువారం-6:31)
సహర్ (శుక్రవారం-5:03)

ఎండలు.. మొదలు..



బండికిరువైపులా దుప్పటి కట్టి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి

వేసవి వచ్చేసింది.. మార్చి రెండోవారం రావడంతోనే ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. పగలంతా ఎండ, ఉక్కపోత ఉండగా, తెల్లవారుజామున చల్లటి గాలులు వీస్తున్నాయి.. మరో వారం, పది రోజుల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగే పరిస్థితి లేకపోలేదు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. జిల్లా కేంద్రం వనపర్తిలో కూలర్లు, ఏసీలు, టేబుల్ ఫ్యాన్ల విక్రయాలు పెరిగాయి. ఒక్కో ఏసీ సర్వీసింగ్‌కు రూ.500-800 వరకు వసూలు చేస్తున్నారు. డిమాండ్ పెరగడంతో ఫోన్ చేసిన మూడు, నాలుగు రోజులకు మెకానిక్‌లు వస్తున్నారు. ఏది ఏమైనా వేడిమికి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇప్పుడే జంకుతున్నారంటే రానున్న రోజుల్లో ఏ విధంగా ఎండలు ఉంటాయో మరి.

\- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వనపర్తి



దాహార్తి తీర్చుకుంటూ..

వనపర్తిలో వారం రోజుల ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
5/03	38.5	18.8
6/03	38.5	16.5
7/03	38.9	16.2
8/03	40.4	16.9
9/03	39.2	18.1
10/03	37.0	18.7
11/03	37.0	18.7
12/03	37.8	19.7

పానీయాలతో ఉపశమనం

ఎండలో బయట తిరిగేవాళ్ళు దాహార్తిని తీర్చుకునేందుకు రోడ్లపై విక్రయించే కొబ్బరి బోండాలు, చెరుకు, పండ్ల రసాలు, లస్సీ, మజ్జిగలతో తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున పానీయాల విక్రయాలు సాగుతున్నాయి. చెరుకు రసం బండ్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. అలానే సోడా, మజ్జిగ కేంద్రాలు వెలిశాయి.



జ్యూస్ సెంటర్ వద్ద..



పుస్తకమే రక్షణగా..



స్కార్ఫ్‌తో యువతులు



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా



తలపై టవల్‌తో వృద్ధురాలు

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

» నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్



నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. గత ఏడాది పదో తరగతి వార్షిక ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 23వ స్థానంలో నిలిచిన జిల్లాను ఈ విద్యా సంవత్సరం 2024-25 ఫలితాలు మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలు, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లపై డీఈవో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలెన్ని?

జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. వాటిలో 59 రెగ్యులర్ విద్యార్థులకు కేటాయించగా ఒక కేంద్రాన్ని ప్రైవేటు విద్యార్థుల కోసం ఏర్పాటు చేశాం. ఈ ఏడాది 45 మంది ప్రైవేటు విద్యార్థులతో కలిపి మొత్తం 10,598 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 5242 మంది బాలురు, 5311 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. అదేవిధంగా 31 మంది బాలురు, 14 మంది బాలికలు ప్రైవేటుగా పరీక్షలు రాయనున్నారు.

● పరీక్షల పర్యవేక్షణకు ఎంత మంది సిబ్బందిని నియమించారు?

జిల్లాలోని 20 మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 60 కేంద్రాలకు 590 మంది ఇన్విజిలేటర్లతో పాటు ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటు అధికారి చొప్పున మొత్తం 60 మందిని పరీక్షల పర్యవేక్షణ కోసం నియమించాం. అదేవిధంగా పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా 4టీంల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించాం. వీరిలో ఒక్కో శాఖ నుంచి నలుగురు చొప్పున విద్య, రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశాం.

● పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాల తరలింపు పూర్తి చేశారా?

జిల్లా వ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాల పరిధిలోని 18 పోలీస్‌స్టేషన్లను ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్లుగా గుర్తించాం. ఈ నెల 8న కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంకు సెట్-2 ప్రశ్న పత్రాలు వచ్చాయి. వాటికి 10న పోలీసుల భద్రత నడుమ ఆయా పరీక్ష కేంద్రాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు తరలించాం. అదేవిధంగా సెట్-1 ప్రశ్న పత్రాలు 12న వచ్చాయి. వాటిని 13న తరలిస్తాం. పరీక్షలు పూర్తయిన వెంటనే ఏ రోజు సమాధాన పత్రాలను ఆ రోజే సమీపంలోని గుర్తించిన పోస్టాఫీసులో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేశాం.

దిగుబడి రాక.. ధర లేక..

● మిర్చి రైతు విలవిల

» కొనేవారు లేక కల్లం దాటని మిర్చి కుప్పలు
» అప్పుల తిప్పలు.. భారమైన మిత్తీలు..
» ఎండలకు రంగుమారుతోన్న కాయ
» ఆందోళనలో రైతులు

దిగుబడి రాక.. ధర లేక మిర్చి రైతుకు కన్నీరు మిగిలింది. అప్పులకు మిత్తీలు భారమై విలవిల్లాడుతున్నాడు. వచ్చిన దిగుబడిని అమ్ముకుందామంటే వ్యాపారులు ముందుకు రావటం లేదు. పండిన పంట కల్లాల్లోనే మగ్గుతున్నది. ఏం చేయాలో తోచక కర్షకుడు ఆందోళన చెందుతున్నాడు. గుంటూరు రకం మిర్చి గతేడాది రూ.12వేల నుంచి రూ.16వేలు పలుకగా ఈ ఏడాది రూ.10 వేలలోపే పడిపోవడం కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. గతేడాదితో పోల్చితే ఈసారి 40శాతం మేర ధరలు పడిపోవడం.. ఇందులో కౌలు రైతులే అధికంగా ఉండటం గమనార్హం.

\- అలంపూర్ చౌరస్తా, ఆంధ్రజ్యోతి



కేంద్రంపై ఒత్తిడి తేవాలి

ధరలు పెరగాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి. గతేడాది ధరలు పెరుగుతాయన్న కారణంగా గోదాముల్లో నిల్వ ఉంచిన మిర్చికి ధరలు రాకపోవడంతో ఇంకా అమ్ముకోలేక పోయారు. ధరలు పెరగకపోవడానికి ఇదీ ఓ కారణం. విదేశాలకు ఎగుమతులు పెరిగితేనే తప్పా భవిష్యత్‌లో ధరలు పెరిగే ఆవకాశం లేదు.

\- ఎస్‌కే హమీద్, మిర్చి ట్రేడర్, అలంపూర్ చౌరస్తా





మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామంలో కల్లాలో ఆరబోసిన మిర్చి



ధర లేదు.. దిగుబడి రాలేదు

నాలుగేకరాలలో మిర్చి సాగు చేశాను. కనీసం 30క్వింటాళ్లు రావాల్సిన గుంటూరు రకం కేవలం 9 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనికి తోడు ధర పడిపోయింది. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా వ్యాపారులు సరిగా రావడం లేదు. తెగుళ్ల, వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఇప్పటి వరకు కోసిన కాయ కల్లం దాటలేదు. దీంతో అప్పులకు మిత్తీలు పెరిగిపోతున్నాయి.

\- గొల్లరాముడు, రైతు, మానవపాడు

గొంతులో అన్నం ముద్ద అడ్డుపడి వ్యక్తి మృతి



గోవిందు (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గొంతులో అన్నం ముద్ద అడ్డుపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. బండి గోవిందు (50) కూలి పనులు చేస్తూ తాగుడుకు బానిసయ్యాడు. దీంతో భార్య గోపమ్మ, తమ ఇద్దరు కుమారులు కలిసి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. మంగళవారం తన ఇంటి వద్ద భోజనం చేస్తుండగా గొంతులో అన్నం ముద్దు అడ్డుపడింది. దీంతో ఆయాసంతో బోర్లపడిన బండి గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల ఇళ్ల వారు హైదరాబాద్‌లో మృతుడి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి పెద్ద కుమారుడు సిద్దార్థ బుధవారం పెద్దకొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

బస్సులు వచ్చేశాయ్..

» ఉమ్మడి జిల్లాలో మహిళా సంఘాలకు 49 కేటాయింపు



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఉన్న ఇందిరా మహిళా శక్తి బస్సు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సులకు యాజమాన్య హక్కులను కల్పించింది. ఈ బస్సులను మహిళలు ఆర్టీసీలో అద్దెకు నడిపించడం ద్వారా ఆదాయన్ని పొందనున్నారు. ఈ నెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 600 బస్సుల యాజమాన్య హక్కులను మహిళా సంఘాలకు కల్పించగా, ఉమ్మడి జిల్లాకు 49 బస్సులను కేటాయించారు. ఒక్కో బస్సు విలువ రూ.33 లక్షలు ఉంటుంది. బస్సులపై ఇందిరా మహిళా శక్తి అనే పేర్లు ఉన్నాయి. నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించారు.

జిల్లాల వారీగా కేటాయింపు..

నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట డిపోకు 5 బస్సులు కేటాయించారు. కల్వకుర్తి డిపోకు 4, కొల్లాపూర్ డిపోకు 2, నాగర్‌కర్నూల్ డిపోకు 2, జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల డిపోకు 4 బస్సులు ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్ డిపోకు 5, రంగారెడ్డి జిల్లా పరిధిలోని షాద్‌నగర్‌కు 17, నారాయణపేట జిల్లాలోని నారాయణపేట డిపోకు 2, కోస్గి డిపోకు 1, వనపర్తి డిపోకు 7 బస్సుల చొప్పున వచ్చాయి.

వినియోగించుకుంటే మంచి లాభాలు

ప్రభుత్వం బస్సులను మహిళా సంఘాల పేరిట కొనుగోలు చేసి, ఆర్టీసీలో అద్దెకు నడిపే అవకాశం కల్పించిందని ఆర్ఎం సంతోష్‌కుమార్ తెలిపారు. సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద గద్వాల నియోజకవర్గానికి చెందిన రైతులకు 200 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలోని ఏడు గ్రామాలకు నూతన సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. రూ.200కోట్లతో దాదాపు 500లకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశానని తెలిపారు. ఏప్రిల్ 10వ తేదీ వరకు ప్రతీ రైతుకు చివరి ఆయకట్టు వరకు విడతల వారీగా సాగునీరు అందించేలా కృషి చేస్తానన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హనుమంతు, జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జిల్లా సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జడ్పీటీసీలు పద్మావెంకటేశ్వర్ రెడ్డి, రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ సర్పంచులు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, ఉరుకుంద, మహబూబ్, నవీన్ రెడ్డి, శ్రీరాములు, కురుమన్న, వీరన్న గౌడ్, నాగన్న, గోపి, మొయినుద్దీన్, పురుషోత్తం రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.



ధరూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

రైతుల ధర్నాతో స్పందించిన విజయ డెయిరీ చైర్మన్

» తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులతో చర్చలు



రైతు సంఘం నాయకులతో చర్చలు జరుపుతున్న విజయ డెయిరీ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి

కల్వకుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ధర్నాలకు విజయ డెయిరీ చైర్మన్ గుత్త అమిత్‌రెడ్డి స్పందించారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు మనకోసం కిశోర్, వెంకట్‌రెడ్డి, ఖాజాపాషా, రఘురామరెడ్డి, శివకుమార్‌రెడ్డిలతో హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ చైర్మన్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను నెలాఖరులోగా చెల్లిస్తామని, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుల సమావేశం ఏర్పాటు చేసి ధరలపై చర్చిస్తామని చైర్మన్ తెలిపినట్లు రైతు సంఘం ప్రతినిధి మనకోసం కిశోర్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఖచ్చితంగా అమలయ్యేలా చూస్తామని పేర్కొన్నారన్నారు. చైర్మన్ దృష్టికి పలు విషయాలు తీసుకెళ్లినట్లు కిశోర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించాలి

» రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



హెచ్‌ఎంలతో సమావేశమై వారి సలహాలు అడిగి తెలుసుకుంటున్న ఆకునూరి మురళి

వంగూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం వంగూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల, ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పెంచేందుకు ఏవిధమైన రూపకల్పన చేస్తే బాగుంటుందని ఉపాధ్యాయుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు ఏ విధమైన మార్పులు చేస్తే ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, అందుకు ఉపాధ్యాయుల పాత్ర ఎలా ఉండాలని ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు పూర్తి విశ్వాసం, నమ్మకం కల్పించేందుకు ఏ విధమైన మార్పులు అవసరమని, అందుకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన సహాయం అవసరమవుతుందనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంతకు ముందు రంగాపూర్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, బోధన పద్ధతులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రమేష్ కుమార్, ఎంఈవో మురళీమనోహర చారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శుభకార్యంలో పాల్గొన్న సీఎం సోదరుడు



కల్వకుర్తిలో ఓ శుభకార్యంలో పాల్గొన్న సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి

కల్వకుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ సోదరుడి పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు హాజరయ్యారు. సీఎం సోదరుడి వెంట మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, ఎన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

30 ఏళ్లుగా శ్రీశైలం మల్లన్న సన్నిధికి పాదయాత్ర

» గ్రామాల సుభిక్షం కోసం 350 కిలోమీటర్ల కాలినడక



మన్ననూరు సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై పాదయాత్ర చేస్తున్న శివ భక్తులు

మన్ననూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే తెలుగు నూతన సంవత్సరంలో గ్రామాల్లోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సంగారెడ్డి జిల్లా ధనశ్రీ మండలానికి చెందిన 35 మంది శివ భక్తులు శ్రీశైలంలోని మల్లన్న సన్నిధికి కాలినడకన పాదయాత్ర చేస్తున్నారు. పాదయాత్ర బృందం అమ్రాబాద్ మండలం మన్ననూరుకు చేరుకోవడంతో స్థానికులు వారికి స్వాగతం పలికారు. ఓ వైపు ఎండలు మండుతున్నా రోజుకు 50కిలో మీటర్లు కాలినడక చేస్తున్నారు. 30ఏళ్ల క్రితం కొందరు శివ భక్తులు మొక్కుబడి కింద పాదయాత్ర మొదలుపెట్టగా ప్రతీ ఏటా కొనసాగుతోంది. మొత్తంగా 350 కిలో మీటర్ల పాదయాత్ర సాగుతుందని వారు తెలిపారు. ఉగాది పర్వదినానికి ముందరి మాసం ఫాల్గుణ మాసంలో పాదయాత్రగా శ్రీశైలం వెళ్లి మల్లన్న, భ్రమరాంబికా అమ్మవార్లను దర్శించుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ధనశ్రీ శివ భక్తబృందం సభ్యులు వెంకట్ రాంరెడ్డి, మల్లన్న, మోహన్, సంజన, సంగమేశ్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్ అప్పగింత



బస్సులో పోగొట్టుకున్న స్మార్ట్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఆర్టీసీ కండక్టర్ ధారా సుందర్

కల్వకుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ జిల్లా కిరణ్‌కుమార్ తన స్నేహితులతో కలిసి జడ్చర్ల నుంచి కల్వకుర్తికి బస్సులో ప్రయాణించాడు. కల్వకుర్తికి రాగానే తన సామ్‌సంగ్ గెలాక్సీ ఫోన్‌ను బస్సులోనే మరిచిపోయి దిగిపోయాడు. గమనించిన కండక్టర్ ధారా సుందర్ ఆ ఫోన్‌ను జాగ్రత్తగా భద్రపర్చాడు. ఫోన్ కాల్స్ ఆధారంగా పోగొట్టుకున్న కిరణ్‌కుమార్‌కు సమాచారం అందేలా చూశాడు. కల్వకుర్తి బస్టాండ్‌కు రప్పించి బస్టాండ్ కంట్రోలర్ సమక్షంలో బాధితునికి కండక్టర్ ధారా సుందర్ రూ.50వేల విలువ గల ఫోన్‌ను అప్పగించారు. పోగొట్టుకున్న ఫోన్ తిరిగి అప్పగించినందుకు ప్రయాణికుడు, కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కండక్టర్ తీరును పలువురు ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.



శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో మనవారు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బుధవారం జరిగిన శాసనసభ బడ్జెట్ సమావేశాలకు హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

దిగుబడి రాక.. ధర లేక..

- మిర్చి రైతు విలవిల
- కొనేవారు లేక కల్లం దాటని మిర్చి కుప్పలు
- అప్పుల తిప్పలు.. భారమైన మిత్తీలు..
- ఎండలకు రంగుమారుతోన్న కాయ
- ఆందోళనలో రైతులు



మానవపాడు మండలం, చెన్నిపాడు గ్రామంలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి

కల్లం దాటని మిర్చి కుప్పలు

అలంపూర్ చౌరస్తా, మార్చి 12: మిర్చి రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ఒక వైపు దిగుబడుల్లేక మరోవైపు ధరల్లేక విలవిల్లాడిపోతున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి 40శాతం మేర ధరలు పడిపోయాయి. అందినకాడికి తెగనమ్ముకుందామన్నా కొనే వ్యాపారులు రాక పండించిన మిర్చిపంట కల్లం దాటడం లేదు. వచ్చే తీవ్రమైన ఎండలకు ఎక్కడ కాయ రంగుమారుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు మిత్తీలు తోడై మిర్చి రైతుకు నిద్రలేకుండా చేస్తున్నాయి.

దిగుబడితో పాటు ధర కుడా దిగువకే..

జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది మిర్చి 65,115 ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది 46,332 ఎకరాలు సాగు చేశారు. ఇందులో కౌలు రైతులే అధికంగా ఉన్నారు. ధరలు ఉంటాయన్న ఆశతో ఎకరం 25వేల నుంచి 45వేల దాకా వెచ్చించి మిర్చిపంట సాగు చేశారు. అత్యధికంగా ఇటిక్యాల మండలంలో 15,967 ఎకరాలు ఆ తర్వాత మానవపాడు మండలంలో 10,615 ఎకరాలు అత్యల్పంగా కేటీదొడ్డి మండలంలో 350 ఎకరాలు సాగుచేశారు. జిల్లాల్లో అత్యధికంగా గుంటూరు మిర్చి, 2043బ్యాడిగి, డబ్బి బ్యాడిగి, ఆర్మూర్, తేజ మొదలగు రకాలు సాగు చేస్తారు. 2043 బ్యాడిగీ రకం ఎకరాకు 10 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుంది. డబ్బీ బ్యాడిగీ ఎకరాకు 7 నుంచి 15 క్వింటాళ్ళ, గుంటూరు రకం 10 నుంచి 30వరకు దిగుబడినిస్తాయి. కానీ ఈ ఏడాది వాతావరణ మార్పులు, వివిధ రకాల తేగుళ్ల కారణంగా దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. గుంటూరు రకం ఎకరానికి 6నుంచి 12 క్వింటాళ్లు, 2043 బ్యాడిగి 4-7, డబ్బి బ్యాడిగి 3-6, తేజ 7-9 క్వింటాళ్లకు దిగుబడులు పడిపోయాయని రైతులు తెలిపారు. ఇక ధరలు చూసుకున్నట్లైతే 2043 రకం 2023లో క్వింటా సుమారు రూ.55వేల వరకు పలికింది. కానీ రెండేళ్లలో రూ.9వేలనుంచి రూ.14వేలకు పడిపోయింది. గుంటూరు రకం గతేడాది రూ.12వేల నుంచి 16వేలు పలుకగా ఈ ఏడాది రూ.10 వేలలోపే పడిపోయింది. ఆర్మూర్ 7వేల నుంచి 10వేలు, తేజ రూ.9వేల నుంచి రూ.13వేలు బహిరంగంగా మార్కెట్లో ధరలుండగా డబ్బి బ్యాడిగీ రూ. 14నుంచి రూ.16వేలు పడిపోయింది.

మిర్చిసాగు చేయాలంటే రైతు తప్పనిసరిగా అప్పు చేయాల్సిందే అన్నట్లు ఉంది నేటి మిర్చిసాగు పరిస్థితి. అయిదేళ్ల క్రితం వరకు ఎకరానికి రూ.70వేలు అవుతున్న పెట్టుబడి గత మూడేళ్లుగా డబుల్ అయింది. మిర్చిసాగు చేయాలంటే కనీసం ఎకరానికి లక్ష నుంచి లక్ష యాభైవేల దాకా పెట్టుబడి అవుతుందని, పైగా అందుకు తగ్గట్లు దిగుబడులు కుడా రావడంలేద ని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది మిర్చిసాగు ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. ఇందు కోసం మిర్చిసాగు చేసిన రైతుల్లో 90 శాతం మంది అప్పులు చేసి సాగుకు పునుకున్నారు. కానీ ఓ వైపు దిగుబడులు తగ్గడం, మరో వైపు ధరలు తగ్గడం ములిగేన క్కపై తాటికాయ పడ్డట్లు అయింది రైతుల పరిస్థితి. ఇప్పటికే సుమారు 40శాతం మంది రైతులు తమ పంటలను కోసి కల్లాల్లో ఆరబెట్టి తాలుకాయలు వేరుచేసి నిల్వ ఉంచు కుంటున్నారు. దేశీయమార్కెట్లో ధరలు పడిపోవడం తో గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులు కూడా రావడం లేదని రైతులు వాపోయారు. గతేడాది కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ ఉంచు కున్న సరుకే అమ్ముడుపోలేదు.. ఇక ఇప్పుడు పండిన ఎండు మిర్చిని ఏసీల్లో దాచు కోలేని పరిస్థితులలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సాగు ఖర్చు ఎకరాకు రూ.లక్షన్నర



ఎకరం రూ.25వేల చొప్పున 2 ఎకరాల్లో మిర్చిపంట సాగు చేశాను. వాతావరణ మార్పుల వల్ల మొదటి నుంచే నల్లి, త్రిప్స్, తెల్లదోమ, పచ్చదోమ దాడులతో జెమిని వైరస్ సోకింది. కనీసం రమారమీ 50 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి రెండెకరాలకు కేవలం 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. అప్పుచేసి సాగు చేసిన ఖర్చే రెండున్నర లక్షలు అయింది. పిచికారీ చేసిన మందుల ఖర్చు ఎల్లేలా కనిపించడంలేదు. - బోయ వెంకటేశ్వర్లు, చెన్నిపాడు

సల్కెలాపూర్‌లో రాష్ట్ర కూటుల ఆనవాళ్లు

» పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి

ఖిల్లాఘణపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలం, సల్కెలాపురంలోని రంగనాథ ఆలయంలో రాష్ట్రకూటుల నాటి ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆలయ చైర్మన్ తూము బుచ్చారెడ్డి అందించిన సమాచారం మేరకు బుధవారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని స్తంభాలను, దానిపై చెక్కిన శిల్పాలను పరిశీలించారు. ఆ స్తంభం 1200 సంవత్సరాల నాటిదని, చారిత్రక ప్రాధాన్యం ఉన్న శిల్పాలను కాపాడుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఆలయం చుట్టూ 200 సంవత్సరాల కాలం నాటి వీరుల శిల్పాలు ఉన్నాయని, వాటిని పీఠాలపై పెట్టి సంరక్షించుకోవాలన్నారు.



ఆలయ స్తంభం పైన చెక్కిన శిల్పాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి

రైతుల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

» నెట్టెంపాడు కాలువలో క్రికెట్ ఆడి నిరసన

ధరూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని బీజేపీ జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. ధరూర్ మండల పరిధిలోని నెట్టెంపాడు - 104 ప్యాకేజీ వద్ద ఎండిన వరి పైర్లను బుధవారం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం నెట్టెంపాడు కాల్వలో క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో డీకే అరుణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా నెట్టెంపాడు ప్రాజెక్టు పనులను 90 శాతం పనులను పూర్తి చేసినట్లు గుర్తు చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మిగిలిన పనులను కూడా పూర్తి చేయకుండా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందాలంటే 104, 105, 106, 107 ప్యాకేజీలను పూర్తి చేయాలన్నారు. 99, 100 ప్యాకేజీలను పూర్తి చేసి 70 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని కోరారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేసి వానాకాలంలో రెండు లక్షల ఎకరాలు, యాసంగిలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పాదయాత్ర చేపడతామని, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, అసెంబ్లీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేవదాస్, మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, చెనుగోనిపల్లి శ్రీను, నాయకులు హనిమిరెడ్డి, ఎర్రభీమ్‌రెడ్డి, నలారెడ్డి, మైలగడ్డ రాముడు, సాయన్న, రాముడు, దేవేందర్ రెడ్డి, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

దోమలపెంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో ఉన్న చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండలం దోమలపెంట అటవీ శాఖ వన మయూరి అతిథి గృహంలో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నల్లమలలో గవర్నర్ పర్యటన ఉన్న సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లనూ, చెంచు పెంటల్లో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం చెంచుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని, వారికి విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఇళ్ల నిర్మాణం, తాగు నీటి సరఫరా, రవాణ సౌకర్యం తదితర మౌలిక వసతులు మెరుగు పర్చేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని భౌరాపూర్, ఈర్లపెంట, సంగడిగుండాల, మేడిమల్కలా మొదలగు పెంటల్లో జీవిస్తున్న కుటుంబాల వారికి కావలసిన వసతులతో పాటు ఆ ప్రాంతంలో చెక్ డ్యాంల నిర్మాణం, బావులు తవ్వడం, అప్పాపూర్ హాస్టల్ విద్యార్థులకు కరెంటు సదుపాయం కల్పించాలన్నారు.

ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రెడ్కో సంస్థ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏ, గిరిజన కార్పొరేషన్, రెడ్కో శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి..

» సర్పంచ్ ఎన్నికల వాయిదాతో ఆశావహుల ఆశలు ఆవిరి

» స్తబ్దుగా పల్లె రాజకీయం

» సంక్రాంతి తర్వాత నోటిఫికేషన్ వస్తుందనడంతో డబ్బులు ఖర్చు పెట్టిన కొందరు..

» 14 నెలలుగా స్పెషల్ పాలనతో నిలిచిన కేంద్రం నిధులు

» కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి

రెండు నెలల క్రితం ఇదిగో సర్పంచ్‌ల నోటిఫికేషన్.. అదిగో సర్పంచ్‌ల నోటిఫికేషన్ అని జరిగిన ప్రచారంతో ఆశావహులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు.. దాంతో పోటీలో నిలవాలనుకున్న ఆశావహులు సంక్రాంతి పండుగకు పల్లెల్లో చేసిన సందడిని జనం ఇంకా మర్చిపోలేదు.. విందులు, దావత్‌లు ఇవ్వడంతో పాటు ప్రజల యోగక్షేమాలు అడుగుతూ వారి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించారు. నవాబ్‌పేట మండలంలో ఓ అభ్యర్థి ఏకంగా పండుగకు ఇంటికో కోడి, కిరాణం సరుకులు, చీరలు, పంచెలు పంపిణీ చేశాడు.. చాలా గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు.. కానీ ప్రభుత్వం ఎన్నిలను వాయిదా వేయడంతో ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. మరోవైపు ప్రత్యేక పాలనతో కేంద్రం నుంచి నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. నిర్వహణ కష్టంగా మారింది.



మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడటంతో పల్లెల్లో రాజకీయం స్తబ్దుగా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో హడావుడి చేయడంతోపాటు మంత్రులు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దాంతో ఆశావహులంతా అలర్ట్ అయ్యారు. గ్రామాల్లో ప్రజలను కలుస్తూ, వారి మద్దతు కూడగట్టుకునేందుకు చేతి చమురు వదిలించుకున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో నోటిఫికేషన్ వస్తుందని, ఆనెల చివరికల్లా ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్న ప్రచారం జోరుగా సాగడంతో ఆశావహులు సంక్రాంతి సంబురాలలో సందడి చేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం జనవరి 26న నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఎన్నికల నోటిఫికేషన్ పడుతుందని అంతా భావించారు. ఒక్కొక్కరు లక్షల్లో డబ్బులు ఖర్చుచేశారు. తీరా ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్ వేస్తూ, బీసీ రిజర్వేషన్లు తేలాకే నిర్వహిస్తామని ప్రకటించడంతో ఆశావహుల ఆశలపై నీళ్ల చల్లినట్లైంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం, అవి అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉండటంతో గ్రామాలలో రాజకీయ స్తబ్దత ఏర్పడింది. ఎక్కడివాళ్ళు అక్కడే గప్‌చుప్ అన్న చందంగా పల్లె రాజకీయం స్లో కావడంతో ఎవరి పనుల్లో వాళ్ల నిమగ్నమయ్యారు.

నిలిచిన కేంద్ర నిధులు.. నిర్వహణ కష్టాలు

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు గ్రామ జనాభా, ఎస్సీ పాపులేషన్ ఆధారంగా ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. ఒక్కో గ్రామానికి రూ.60 వేల నుంచి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు నిధులు వచ్చేవి. ఈ నిధులతో గ్రామ అవసరాలు, జీతాలు చెల్లించేవాళ్లు. ప్రత్యేక పాలన వచ్చిన తరువాత ఒకసారి మాత్రమే కేంద్రం నిధులు వచ్చాయి. నాలుగు క్వార్టర్ల డబ్బులు నిలిచిపోవడంతో పల్లె పాలన కుంటుపడింది. ఒక్కో గ్రామ పంచాయతీకి ఏడాదికాలంగా రూ.3 లక్షల నుంచి రూ.10-12 లక్షల వరకు నిధులు రాకపోవడంతో అత్యవసర పనులైన పారిశుద్యం, వాటర్‌వర్క్స్, స్ట్రీట్ లైట్ పనులకు పల్లెల్లో కొందరు నాయకులు, అధికారులు సొంత నిధులు వెచ్చిస్తున్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ వర్కర్‌ల జీతాలు మాత్రం విడుదల చేస్తోంది. అవికూడా జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీ పరిధిలో ఈ ఏడాది కాలంలో రూ.2-5 లక్షల వరకు సొంత నిధులు వెచ్చించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్డు పనులు జరుగుతుండగా, ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధి నిధులు కొన్ని రావడంతో వాటితో కష్టంగా నెట్టుకొస్తున్నారు. నిధులకు ఇబ్బందిగా మారడంతో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల మెయింటెనెన్స్‌కు అత్యవసర గ్రాంట్లు విడుదల చేయాలని కలెక్టర్‌కు లేఖ రాయడం రాశారు. పెద్ద గ్రామ పంచాయతీలలో పన్నుల రూపంలో వచ్చిన నిధులను మెయింటెనెన్స్‌కు వెచ్చిస్తున్నారు.

● హన్వాడ మండలం మునిమోక్షం గ్రామానికి ప్రతీ మూడు నెలలకోసారి 15వ సంఘం ఆర్థిక నిధులు రూ.3.30 లక్షలు వచ్చేవి. ఆ నిధులతో స్ట్రీట్‌లైట్స్, వాటర్‌వర్క్స్ ట్రాక్టర్ల ఈఎంఐ, డీజిల్, జీపీ మల్టీ పర్పస్ వర్కర్స్ జీతాలు ఇచ్చేవాళ్లు. ప్రస్తుతం కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో మల్టీ పర్పస్ జీతాలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తోంది. దీంతో గ్రామ పంచాయతీలలో సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,690 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పాలక మండలి గడువు 2024 జనవరి 26న ముగిసింది. దాదాపు 14 నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్పెషల్ పాలనను కొనసాగిస్తున్నారు. ప్రతీ ఆరు నెలలకోసారి ప్రత్యేక పాలనను పొడిగిస్తున్నారు. పాలక మండలి లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచి, గ్రామ పంచాయతీల అభివృద్ధి, మెయింటెనెన్స్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. ఒక్కో విడతలో ఉమ్మడి జిల్లాకు రూ.32-34 కోట్ల కేంద్ర నిధులు వచ్చేవి. ఈ లెక్కన నాలుగు విడతల్లో రూ.125-130 కోట్ల నిధులు నిలిచిపోయాయి.



హోలీ.. రంగుల కేళీ

- నేడు కామదహనం రేపు పండుగ
- రంగులు చల్లుకునేటప్పుడు జాగ్రత్తలు అవసరం
- కంట్లో పడితే చూపు కోల్పోయే ప్రమాదం
- చర్మ సమస్యలు వచ్చే పరిస్థితి



విరగ పూసిన మోదుగ పూలు


నారాయణపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రంగుల పండుగ దగ్గరకొచ్చేసింది. ఈ నెల 14న హోలీ పర్వది నాన్ని ఆనందంగా జరుపుకునేందుకు యువతీ యువకులు, చిన్నారులు ఉత్సాహంగా సిద్ధం అవుతున్నారు. అంతకు ముందు రోజు రాత్రి, అంటే 13న రాత్రి గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు కామదహనం నిర్వహిస్తారు. శుక్రవారం హోలీ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకుంటారు. యువతీ యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ, కేరింతలు రంగుల్లో మునిగి తేలుతారు. అయితే రంగులు చల్లుకునేటప్పుడు అత్యుత్సాహం ప్రదర్శించొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కళ్లల్లో రంగులు పడి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అలాగే రంగుల్లోని రసాయనాలతో చర్మ సమస్యలు, ఎలర్జీలు వచ్చే అవకాశం ఉందని చెప్తున్నారు. అలాగే యువతీ యువకులు అత్యుత్సాహంతో రంగులు పులుముకునేటప్పుడు వేలి గోర్లు కళ్లలో కుచ్చుకునే ప్రమాదం ఉంది. ఈ విషయంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

రంగుల్లో ప్రమాదకర రసాయనాలు

- రంగుల్లోని రసాయనాల కారణంగా ప్రమాదాలు పొంచి ఉన్నాయని కంటి వైద్య నిపుణులు చెప్తున్నారు.
- రంగులు చల్లడానికి స్ప్రేయర్లను వినియోగిస్తారు. వాటి నుంచి రంగునీరు వేగంగా కళ్లపై పడతాయి. కళ్లలో నుంచి నీరు బయటకు వెళ్లిపోయినా, వాటిల్లోని రసాయన పదార్థాలు కంటిలోనే ఉండిపోయి, బాక్టీరియా చేరే అవకాశం ఉంది.



- రసాయనాలతో కంటి లోపలి పొరలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కళ్ళు మండటం, నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలి.
- రంగు నీళ్ళు చెవుల్లోకి చొచ్చుకుపోతే సున్నిత భాగాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.



కిడ్నీలు ఖరాబ్

- రోజురోజుకూ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 760 మంది వ్యాధిగ్రస్తులు
- 14 డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి
- నేడు ప్రపంచ కిడ్నీ దినం



మహబూబ్‌నగర్ డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కిడ్నీ వ్యాధి బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో 60 ఏళ్ల వయసు దాటిన వారికే కిడ్నీలకు సంబంధించిన సమస్యలు, వ్యాధులు వచ్చేవి. కానీ ప్రస్తుతం ప్రజల ఆహారపు అలవాట్లు, జీవన ప్రమాణాల్లో మార్పులతో వయసుతో సంబంధం లేకుండా మూత్ర పిండాల వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 760 మంది కిడ్నీ వ్యాధి బారిన పడి డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. కిడ్నీలు పాడైన తర్వాత డయాలసిస్‌కు వెళ్తున్నారు గానీ, వ్యాధిని ముందస్తుగా గుర్తించే వైద్యులు మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో లేకపోవడం విచారకరం. దీంతో బాధితులు ఓపీ కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నేడు ప్రపంచ కిడ్నీ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

సమస్యకు ప్రధాన కారణాలు..

కిడ్నీ సమస్యలు రావడానికి హైబీపీ, మధుమేహం ప్రధాన కారణాలని వైద్యులు చెప్తున్నారు. షుగర్, బీపీలను కంట్రోల్‌లో ఉంచుకోకపోతే కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక సారి సమస్య వచ్చిందంటే కిడ్నీ మార్పించుకోవాలి లేదా జీవితాంతం రక్త శుద్ధి చేయించుకోవాల్సి ఉంటుంది. అవసరం, పరిస్థితిని బట్టి వారంలో రెండు, మూడు సార్లు రక్తశుద్ధి చేయించుకోకపోతే ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

760 మంది బాధితులు

ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కిడ్నీలు పాడైన వారు 760 మంది ఉన్నారు. వీరంతా ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. బాధితుల్లో సగానికి సగం మంది 20 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్నవారు కావడం గమనార్హం. వ్యాధిని ముందస్తుగా గుర్తించకపోవడం వల్లే పరిస్థితి విషమించి రక్తశుద్ధి చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు అంటూ స్థానిక ఆర్ఎంపీల వద్దకు వెళ్తున్నారు. వారు ఇష్టం వచ్చినట్లు యాంటిబయోటిక్స్, పెయిన్ కిల్లర్ మాత్రలు ఇస్తుండటం కూడా కిడ్నీలు చెడిపోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

14 డయాలసిస్ కేంద్రాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కిడ్నీ వ్యాధి బాధితులకు రక్తశుద్ధి కోసం 14 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10, ప్రైవేటు ఆసుపత్రుల్లో మరో 4 కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వం పరిధిలో మహబూబ్‌నగర్, బాలనగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, అలంపూర్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. ప్రైవేటు పరిధిలోని మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్, సుశ్రుత, నవోదయ, గద్వాల పట్టణంలోని శుభకర, జడ్చర్లలోని మహవీర్ ట్రస్టు ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. జడ్చర్లలోని వంశీ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం ప్రస్తుతం మూత పడింది. అందులోని రోగులను స్థానిక జడ్చర్ల, మహబూబ్‌నగర్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అలాగే మక్తల్, ఆత్మకూరు ప్రాంతాల్లో కొత్తగా రెండు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు కానీ, అవి ఇంకా అందుబాటులోకి రాలేదు.

కొంత మేరకు సేవలు

కిడ్నీ వ్యాధి బాధితులకు జనరల్ మెడిసిన్‌లో కొంత మేరకు సేవలందిస్తున్నాం. ముందుగా అన్ని పరీక్షలను చేసి చికిత్స ఇప్పిస్తున్నాం. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఉస్మానియా ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాం. దీంతో పాటు యూరాలజీకి సంబంధించి సర్జరీ విభాగం వైద్యులు సేవలు అందిస్తున్నారు. నెఫ్రాలజీ, యూరాలజీ వైద్యసేవల కోసం ప్రైవేటు డాక్టర్లు సేవలందించేలా చూస్తున్నారు. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ కూడా పూర్తి సహకారం అందిస్తున్నారు. త్వరలోనే కిడ్నీ వ్యాధులకు సంబంధించిన సేవలు ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



- డా. సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్.

ఓపీ కోసం ప్రైవేటుకే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కిడ్నీకి సంబంధించిన నెఫ్రాలజిస్టులు, వైద్యులు లేరు. డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి చేయించుకుంటున్న వారికి మాత్రం నిమ్స్ వైద్యులతో టెలీ కన్సల్టెంట్ సౌకర్యం ఉంది. అంతేగానీ ఏ ఒక్క ఆసుపత్రిలోనూ ఓపీ సదుపాయం లేదు. దీంతో ప్రైవేటు పరిధిలోని వైద్యుల వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కిడ్నీ వ్యాధి బాధితులు దాదాపు రెండు వేల మందికి పైగా ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వారంతా ఆయా ఆసుపత్రుల్లో ఓపీ సేవలు పొందుతున్నట్లు అనధికారికంగా తెలుస్తోంది.



గద్వాల జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో రక్తశుద్ధి చేయించుకుంటున్న బాధితులు

కేంద్రాల వారీగా బాధితులు

కేంద్రం	బాధితులు
మహబూబ్‌నగర్	60
బాలానగర్	10
అచ్చంపేట	37
కల్వకుర్తి	38
అలంపూర్	20
గద్వాల	90
నాగర్‌కర్నూల్	50
నారాయణపేట	61
వనపర్తి	88
కొల్లాపూర్	25
ఎస్వీఎస్ (మహబూబ్‌నగర్)	107
సుశ్రుత (మహబూబ్‌నగర్)	30
నవోదయ (మహబూబ్‌నగర్)	65
వంశి (జడ్చర్ల)	50
వంశీధర (గద్వాల్)	29
మొత్తం	760

కలగన్నారు.. కొలువు సాధించారు..

ఉన్న ఉద్యోగంతో సంతృప్తి చెందలేదు.. ఉన్నత ఉద్యోగం సాధించాలని కలలు గన్నారు. ఒక వైపు విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్-2 కోసం సిద్ధమయ్యారు. కష్టాన్ని ఇష్టంగా భావించి రేయింబవళ్లు సాధన చేశారు. అనుకున్నది సాధించారు. మంచి ర్యాంకు తెచ్చుకున్నారు. అయినా మరో ముందడుగు కోసం కృషి చేస్తూనే ఉంటామని, గ్రూప్ -1 సాధించడమే తమ లక్ష్యమని వారు చెప్తున్నారు. గ్రూప్ -2 విజేతలు కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలు మీ కోసం...

- నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వీపనగండ్ల (ఆంధ్రజ్యోతి)

గ్రూప్ -1 సాధించడమే లక్ష్యం



- నేహా కాంబ్లే, నారాయణపేట

గ్రూప్-1 సాధించడమే లక్ష్యమని నారాయణపేటకు చెందిన నేహ కాంబ్లే అన్నారు. పట్టణానికి చెందిన టైలర్ అంబర్ కుమార్తె స్నేహ ప్రస్తుతం బొమ్మన్‌పాడ్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. ఆమె భర్త మహేశ్ ఎస్పీ ఆఫీస్ ఐటీ కోర్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-2లో 361 మార్కులతో, రాష్ట్ర స్థాయిలో 799 ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమయ్యారు. గ్రూపు-2లో విజయం సాధించారు. సిలబస్‌ను ఫాలో అవుతూ, ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రధాన అంశాలపై నోట్స్ రాసుకుంటూ సాధన చేస్తే సులభంగా ర్యాంకు సాధించవచ్చని తెలిపారు. భర్తతో పాటు అత్తమామలు, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో గ్రూప్ -1 సాధించడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

వార్డు ఆఫీసర్‌గా పని చేస్తూనే...



- గ్రూప్-2లో 31వ ర్యాంకు సాధించిన వేణు

నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండలం పగిడిమర్రికి చెందిన బుగ్గప్ప, పద్మమ్మ దంపతుల కుమారుడు వేణు నారాయణపేట మునిసిపాలిటీలో 14 వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ పూర్తి చేసిన ఆయన 2024, డిసెంబర్‌లో వార్డు ఆఫీసర్‌గా నియమితులయ్యారు. 2022 నుంచి గ్రూప్-2 పరీక్షలు మూడు సార్లు వాయిదా పడ్డాయి. ఆ సమయంలో ఆరు నెలల పాటు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు చదువుతూ, వెయిటేజీ అధికంగా ఉన్న సబ్జెక్టులు చదువుతూ సొంతం నోట్స్ రాసుకొని గ్రూప్ -2 కు సిద్ధం అయ్యారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో 31వ ర్యాంకు సాధించారు. పరీక్షలో సమయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఒత్తిడికి గురికాకుండా రాస్తే మంచి ర్యాంకు సాధించవచ్చని సూచిస్తున్నారు. తండ్రి బుగ్గప్ప మక్తల్ మునిసిపాలిటీ వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

తొలి ప్రయత్నంలోనే ర్యాంకు



తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలం, పెద్దూరుకు చెందిన డి.రమేశ్ అన్నారు. 2016లో బీటెక్ పూర్తి చేసిన ఆయన ఆర్థిక అవసరాల రీత్యా కొన్నాళ్లు ప్రైవేట్ ఉద్యోగం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో దానికి రిజైన్ చేసి, 2021 నుంచి గ్రూప్స్ ప్రిపరేషన్ ప్రారంభించారు. అందుకోసం హైదరాబాదులో శిక్షణ పొంది, ప్రణాళికతో గ్రూప్స్‌కు సిద్ధమయ్యారు. గ్రూప్-2 పరీక్షకు హాజరై తొలి ప్రయత్నంలోనే 373 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 394 ర్యాంకు సాధించారు. తన ర్యాంకు ప్రకారం గ్రూప్-2 రాష్ట్ర స్థాయి క్యాడర్‌లో ఉద్యోగం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యమన్నారు. అందుకోం నిరంతర కృషి చేస్తానని తెలిపారు.

- డి.రమేశ్, పెద్దూరు,
తెలకపల్లి మండలం

గ్రూప్-2లో అజయ్‌రెడ్డికి స్టేట్ 17వ ర్యాంక్



వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన అజయ్‌రెడ్డి గ్రూప్-2లో స్టేట్ 17వ ర్యాంకు సాధించారు. అదే గ్రామానికి చెందిన భరత్‌యాదవ్ 75 ర్యాంకు సాధించారు. అజయ్‌రెడ్డి ప్రస్తుతం చిన్నంబాయి తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గజిటెడ్ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివానని, కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కవిత, సత్యశివారెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారని తెలిపారు. వారి ప్రోత్సాహంతోనే ముందడుగు వేసినట్లు ఆయన చెప్పారు. భరత్‌యాదవ్ ప్రస్తుతం డిగ్రీ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తమ ఊరికి చెందిన ఇద్దరు గ్రూప్-2లో విజయం సాధించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమంగా బియ్యం నిల్వ

- నసరుల్లాబాద్‌లోని 37వ రేషన్ దుకాణంపై కేసు

జడ్చర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆదిత్య పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, నసరుల్లాబాద్ గ్రామంలోని 37వ నెంబరు రేషన్ దుకాణంలో అక్రమంగా బియ్యం నిల్వ చేశారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు బుధవారం రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. బియ్యం నిల్వ రిజి స్టర్‌లో నమోదు చేసిన దాని కంటే 24.15 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉన్నట్లుగా గుర్తించారు. గ్రామస్థుల సమక్షంలో పంచనామా నిర్వహించి, బియ్యాన్ని సీజ్ చేశారు. సదరు రేషన్ దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. శాఖాపరంగా జరిమానా విధించనున్నట్లు సివిల్ సప్లైశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. రేషన్ దుకాణంలో నిత్యావసర సరుకులు, ఆయిల్ ప్యాకెట్లు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దన్నారు.



రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారులు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



శ్రీకృష్ణవేణి జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను వరుస క్రమంలో పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ గద్వాల సర్కిల్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని 36 పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పరీక్షకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,640 మందికి గాను, 10,380 మంది పరీక్షకు హాజరయ్యారు. 260 మంది పరీక్ష రాయలేదు. జనరల్ విద్యార్థులు 8,746 మందికి గాను, 8,537 మంది పరీక్ష రాశారు. 209 మంది గైర్హాజ రయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,894 మందికి గాను, 1,843 మంది హాజరు కాగా, 51 మంది గైర్హాజర య్యారు. అయితే కొన్ని ప్రశ్నల్లో తప్పులు వచ్చినట్లు కొందరు విద్యార్థులు తెలిపారు. .

- జోగుళాంబ గద్వాల జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో 3,764 విద్యార్థులకు గాను 3,649 (97 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో జనరల్ 3,093 మందికి, 3002 (97 శాతం) మంది, వృత్తి విద్య 671 మందికి 647 (96 శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గద్వాల, మల్దకల్, అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు, అరోరా, శ్రీహరిహర కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను డీఐఈవో హృదయరాజు తనిఖీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 6,324 మంది విద్యార్థులకు గాను, 6,132 మంది పరీక్ష రాశారు. 192 మంది గైర్హాజరయ్యారు.
- నారాయణపేట జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 4,074 మందికి గాను 3,988 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 86 మంది గైర్హాజరయ్యారు. వారిలో జనరల్ విద్యార్థులు 3,527 మందికి గాను 3,460 మంది పరీక్షలు రాశారు. 67 మంది రాయలేదు. ఒకేషనల్‌లో 547 మందికి గాను 528 మంది పరీక్షలు రాయగా, 19 మంది గైర్హాజరయ్యారు. నారాయణపేట పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రావు తనిఖీ చేశారు.
- వనపర్తి జిల్లాలో 5,987 మంది విద్యార్థులకు గాను, 5,837 మంది పరీక్ష రాశారు. 150 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 5,006 మంది విద్యార్థులకు, 4,896 మంది పరీక్ష రాశారు. 110 మంది రాయలేదు. ఒకేషనల్ 981 మంది విద్యార్థులకు గాను, 941 మంది హాజరయ్యారు. మరో 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వ్యక్తి మృతి

- పొలంలో లభ్యమైన అస్థిపంజరం



వీరస్వామి (ఫైల్)

వీపనగండ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఓ వ్యక్తి మృతి చెందాడు. 18 రోజుల తర్వాత అతడి అస్థిపంజరం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన వీరస్వామి (35) శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 23న స్వాముల వెంట శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. గ్రామం నుంచి అయిదు కిలోమీటర్లు వెళ్లాక, గుట్టపై తాను నడవలేకపోతున్నానని, ఇంటికి వెళ్లిపోతానని స్వాములకు చెప్పి వినుదిరిగాడు. కానీ ఇంటికి చేరలేదు. ఈ విషయంపై 26వ తేదీన అతడి తమ్ముడు విష్ణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే మండలంలోని సంపత్రావుపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు ఖాసీం పొలంలో ఉధవారం ఒక అస్థిపంజరం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ రాణి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పక్కనే ఉన్న సంచిలోని ఆధార్ కార్డు ఆధారంగా వీరస్వామి అని గుర్తించి, కుటుంబసభ్యులకు తెలిపారు. అదే సంచిలో ఒక మద్యం సీసా కూడా ఉంది. అనారోగ్యంతో ఉన్న అతడు మద్యం తాగి అక్కడే చెట్టుకింద పడుకొని, అలాగే మృతి చెంది ఉండొచ్చని తెలిపారు. మృతదేహాన్ని అడవి జంతువులు పీక్కు తినడంతో ఎముకలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని చెప్పారు. వీరస్వామికి భార్య స్వప్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని వనపర్తి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అంకాని రాములు (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పెద్ద కార్పాముల గ్రామానికి చెందిన అంకాని రాములు (36), భూషిపాగ స్వామి ఈనెల 2వ తేదీన ద్విచక్ర వాహనంపై పెద్దకొత్తపల్లికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గం మధ్యలో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొన్నారు. దీంతో వాహనం వెనుక కూర్చున్న అంకాని రాములు కింద పడి తలకు బలమైన గాయం అయ్యింది. అతడిని వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ఐదు ట్రాక్టర్లు కనిపించడంతో తనిఖీ చేశారు. తరలింపునకు అనుమతి లేదని గుర్తించి, స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఇంటర్వ్యూ

అధికారుల సూచనలతో అధిక దిగుబడి

- రాజవర్ధన్ రెడ్డి, వ్యవసాయ అధికారి



పాన్‌గల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పంటలు సాగు చేసేటప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు సాధ్యమవుతుందని పాన్‌గల్ మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

మండలంలో భూసార పరీక్షలు ఎలా నిర్వహిస్తారు.?

రైతులు తమ పొలంలో కిలో మెత్తటి మట్టిని సేకరించి సంబంధించిన ఏఈవో లకు ఇస్తే జడ్చర్లలోని మట్టి నమూనా కేంద్రానికి పంపించి భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు రిపోర్టు అందజేస్తాం.

సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నారా?

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఎరువు తయారు చేసే విధానం, వాటిని ఏవిధంగా పంటలకు వేయాలి, పూర్తి స్థాయిలో పచ్చిరొట్ట, వేప నూనె వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రస్తుతం ఎన్ని ఎకరాలు సాగు చేశారు.

12వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో వేరుశనగ, 50 ఎకరాలు మొక్కజొన్న, 2వేల ఎకరాలు మినుమును సాగు చేశారు.

న్యూస్ బాక్స్

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని ఆయా వార్డులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని 6, 7వ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించి మాట్లాడారు. ఆయా వార్డుల్లో అంతర్గత రహదారులు డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. సీపీఎం నాయకులు వెంకటేష్, విష్ణు, కరుణా కర్, చంటి, శ్రీను, అంజి, విష్ణు, మల్లేష్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా కృష్ణవర్ధన్‌రెడ్డి

మదనాపురం, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జిగా మండలంలోని అజ్జకొల్లుకి చెందిన కృష్ణవర్ధన్‌రెడ్డిని బుధవారం నియమించారు. ప్రస్తుతం ఈయన రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నాడు. ఇతని సేవలను గుర్తించి.. నారాయణపేటకు ఇన్‌చార్జిగా నియమించారు.

అక్రమ అరెస్టులు సరికావు

మదనాపురం, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం కాదని, అక్రమ అరెస్టుల పాలన కొనసాగుతుందని మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కురుమూర్తి అన్నారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లు చెల్లించాలని చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టిన వారిని బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులను సొంత డబ్బులతో చేసి, బిల్లులు కాక అప్పులపాలు అయ్యామన్నారు. కోట్ల తిరుపతయ్య, శివశంకర్, రాజ్‌కుమార్, టి.కె కృష్ణ ఉన్నారు.

తాగి వాహనాలు నడపొద్దు

అమరచింత, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అమరచింత ఎస్‌ఐ సురేష్ పేర్కొన్నారు. బుధవారం అమరచింత మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం లాంటి సంఘటనలను కఠినంగా పరిగణిస్తుందని హెచ్చరించారు.

గ్రామ పారిశుధ్య కార్మికుల భిక్షాటన

పాన్‌గల్/రేవల్లి / పెద్దమందడి, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : గ్రామ పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలని పాన్‌గల్, రేవల్లి, పెద్దమందడి మండలాల్లోని గ్రామ పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. 3 నుంచి 8 నెలల వరకు జీతాలు చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

గోపాల్‌పేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలకు వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వనపర్తి జిల్లా జేఏసీ ప్రతినిధి గోపి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో బొందయ్య, లక్ష్మీ, బాలమ్మ తదితరులు పోలీసులు అరెస్టు చేశారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

వనపర్తి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల నుంచి కళాశాల, పరీక్ష ఫీజులు వసూలు చేసి బోర్డులకు చెల్లించని స్వర్ణభారతి పారామెడికల్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్ తదితరులు ఉన్నారు.

నిర్మించి.. నిరుపయోగం

» గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో వైకుంఠధామం

» దీంతో ఉపయోగించుకోని గ్రామస్థులు

రేవల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.పది లక్షల నిధులు ఖర్చు చేసి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో వైకుంఠధామాలు ఏర్పాటు చేసింది. కానీ వాటిని గ్రామాలకు దూరంగా నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారాయి. గ్రామాలకు దూరంగా ఏర్పాటు అనవసరంగా నిధులు వృథా చేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేవల్లి మండల కేంద్రంలో ఆ గ్రామ వైకుంఠధామం గ్రామానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఎవరూ లేని ఒక అనాథ మృతదేహం మినహా ఆ వైకుంఠధామాన్ని ఎవరూ ఉపయోగించ లేదు. అన్ని వసతులు ఉన్నా.. సిబ్బంది పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రామానికి చాలా దూరం ఉండటంతో ఎవరూ వాడటం లేదు. రేవల్లి మండల కేంద్రంలోనే కాకుండా నాగపూర్, తల్పునూర్ వంటి గ్రామాల్లోని వైకుంఠధామాలు కూడా వినియోగంలో లేవు.



రేవల్లి మండల కేంద్రంలో నిరుపయోగంలో ఉన్న వైకుంఠధామం

దూరమైందంటున్న ప్రజలు



రేవల్లి గ్రామం నుంచి వైకుంఠధామం దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉందని ప్రజలు వాపోతున్నారు. అక్కడ అన్ని వసతులు ఉన్నాయి. సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతున్నాం.

- హరీశ్, రేవల్లి, గ్రామ కార్యదర్శి

కట్టుదిట్టమైన భద్రతలో ఈవీఎంల గోదాం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎంల గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

నిర్మాణాలను పూర్తి చేయాలి

కొత్తకోట : పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల అదనపు గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో కలిసి నిర్మాణంలోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డీఈవో గోవిందు నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నరేష్, కార్తీక్ ఉన్నారు.

తప్పులు లేకుండా చేపట్టాలి

పెబ్బేరు రూరల్ : యాసంగి సీజన్‌లో రైతులు పంటల సాగు చేసిన నమోదు వివరాలను తప్పులు లేకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని కంచిరావుపల్లిలో పర్యటించి పాఠశాలను తనిఖీ చేపట్టి, పంటల సాగు వివరాల నమోదును పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మి, ఏవో షేక్‌మున్నా, ఎంఈవో జయరాములు తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్లకు నైట్ హాల్ట్ బస్సు

వీపనగండ్ల, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రం నుంచి వీపనగండ్ల మండల కేంద్రానికి నైట్ హాల్ట్ బస్సును బుధవారం ప్రారంభించినట్లు వనపర్తి ఆర్టీసీ డీపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాత్రి 7:20కి వనపర్తిలో బయలుదేరి మండల కేంద్రానికి 8.30 గంటలకు చేరుకుంటుందని, మరుటి రోజు ఉదయం 4:40 నిమిషాలకు బయలు దేరుతుందని చెప్పారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ కూలీల సమస్యలను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అజయ్ డిమాండ్ చేశారు. బుధవారం అమరచింతలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు పని దినాలు పెంచడంతో పాటు సకాలంలో వారికి కూలీ డబ్బులను అందించాలని డిమాండ్ చేశారు. పనుల వద్ద టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లాంటి సౌకర్యాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాన్‌గల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెగ్యులర్ ఇమ్యూనైజేషన్ సెషన్ సైట్‌ను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అకస్మాతుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వచ్చే అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పిల్లల తల్లులకు తెలిపారు. గర్భిణులు సరైన సమయంలో మొదటి, రెండో డోసస్ టీటీ వ్యాక్సినేషన్ చేయించుకోవాలని, ఈ వ్యాక్సిన్‌తో తల్లిపిల్లలకు ధనుర్వాతం వ్యాధి రాకుండా నివారిస్తుందన్నారు. హెల్త్ అసిస్టెంట్స్ నాగేశ్వరి, ఆశ కార్యకర్త అలివేలు, అంగన్‌వాడీ టీచర్, బాలింతలు పాల్గొన్నారు.

ముస్లింలను ఆదుకోవాలి

వనపర్తి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రంజాన్‌ను పురస్కరించుకుని నిరుపేద ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రంజాన్‌ను పురస్కరించుకుని మసీదులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ముస్తాబు చేయించాలని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను ఓట్లకు మాత్రమే వాడుకుంటుందని, వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును కూడా అందించాలని కోరారు. సమావేశంలో చాంద్‌పాషా, మహబూబ్ పాల్గొన్నారు.

కల్వరాలకు నిధులు మంజూరు

వీపనగండ్ల, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాల గ్రామాభివృద్ధి పనులకు కలెక్టర్ నిధుల నుంచి రూ.17 లక్షలు మంజూరైనట్లు పర్యాటక శాఖ నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.14 లక్షలు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు శ్రీరంగాపురం రంగనాథస్వామి రథోత్సవం

పెబ్బేరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగాపురం రంగనాథస్వామి రథోత్సవం గురువారం వైభవంగా చేపట్టేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రంగనాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గజవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రథోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ అర్చకుడు విష్ణునారాయణచారి తెలిపారు.

విద్యార్థులకు ప్రథమ బహుమతి

కొత్తకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాయనిపేట గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జిల్లా సైన్స్ మేళాలో ప్రథమ బహుమతి గెలుపొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ వారు జిల్లాస్థాయి సైన్స్ మేళా పోటీలు నిర్వహించారు. రాయనిపేట పాఠశాల విద్యార్థులు మెహమిస్, లాస్య ప్రదర్శించిన ఆ టోమెటిక్ సెలైన్ అలారం సిస్టం ప్రాజెక్టు జిల్లా స్థాయి ప్రథమ బహుమతికి ఎంపికైంది. రూ.7,500 నగదుతో పాటు మెమోంటోను ఎస్పీ రావుల గిరిధర్ అందజేశారు. ఉపాధ్యాయులను హెచ్‌ఎం అభినందించారు.

చట్టసభల్లో స్థానం సాధించాలి

ఆత్మకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల వారు చట్టసభల్లో స్థానం సాధించేలా ఎదగాలని ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత రాజ్యాంగం బడుగు బలహీన వర్గాల వారికి అనుకూలంగా ఎన్నో చట్టాలను రూపొందించినా.. సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యతోనే సామాజిక న్యాయం సాధించడం సాధ్యమవుతుందన్నారు. రాయికంటి రాందాస్, అంజన్న, దాసు, రామ్ నాయక్, సత్యం, కురుమన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఆత్మకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం గాంధీ చౌరస్తాలో చేపట్టిన రిలే దీక్షలకు మాజీ వార్డు సభ్యుడు గడ్డమీద శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదిక ఆధారంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా.. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేస్తూ.. మాదిగలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రస్తుతం ప్రకటిస్తున్న నోటిఫికేషన్లలో రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే మాదిగలు తీవ్రస్థాయిలో నష్టపోయే అవకాశం ఉందన్నారు. మాదిగలు, దాని ఉపకులాలను కలుపుకొని మంద కృష్ణ నాయకత్వంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ, సోంబాబు, రామకృష్ణ, లక్ష్మణ్, జానకిరామ్, కిషోర్, మాసన్న, శ్రీనివాసులు, రాము తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యువకులు బాధ్యతాయుతంగా ఎదగాలి

వనపర్తి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువకులు బాధ్యతాయుతంగా ఎదగాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి యువ ఉత్సవ్ 2025 కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, జీవితంలో తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. అంతేకాకుండా సమాజంలో స్త్రీలతో పాటు కుటుంబ సభ్యులను ఇతరులను గౌరవించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం సైన్స్ మేళాను పరిశీలించి విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. అదే విధంగా యువతి యువకులకు నిర్వహించిన కవిత్వం, చిత్రలేఖనం, సైన్స్ మేళా, ఉపన్యాస పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన పలువురికి ప్రశంసా పత్రాలను తన చేతుల మీదుగా అందజేశారు.

నెహ్రూ యువ కేంద్రం మహబూబ్ నగర్ అధ్యక్షుడు కోటా నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, జిల్లా క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు రాజేందర్, ఉపాధ్యాయులు మల్లయ్య, నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యుడు అరవింద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలి

వనపర్తి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అర్జున్ సాతర్ల డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా రంగంపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని మండిపడ్డారు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేవలం ఏడు శాతం నిధులే కేటాయించిందని, వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదన్నారు. చిన్న రాష్ట్రాల్లో సైతం వాటి బడ్జెట్‌లో 12 నుంచి 13 శాతం నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జ్ఞానేశ్వర్, శివకుమార్, నగర ఉపాధ్యక్షుడు బంటి చరణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్ సాతర్ల

నెలాఖరులోగా ఇంటి పన్ను వసూలు చేయాలి

ఆత్మకూరు , మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలాఖరులోగా ఇంటి పన్నుల వసూలును పూర్తి చేయాలని వనపర్తి జడ్పీ సీఈవో యాదయ్య పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ శశిధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, బిల్ కలెక్టర్ల సమావేశానికి ఆయన బుధవారం హాజరై మాట్లాడారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలో రెండు కోట్లకు పైగా ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 47 శాతం మాత్రమే పూర్తి చేశారన్నారు. ఇది వరకు ఎల్ఆర్ఎస్ ద్వారా తమ ప్రాపర్టీని బుకింగ్ చేసుకున్న వినియోగదారులు మార్చి 31లోగా తమ ప్రాపర్టీని బుకింగ్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ ఖర్చుల్లో 25 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ఎంపీడీవో శ్రీపాద, వార్డు ఆఫీసర్లు, మునిసిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో యాదయ్య

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

అమరచింత, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరచింత యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలోని అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనుకున్న లక్ష్యం సాధించే వరకు విద్యార్థులు పట్టుదలతో క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. సదస్సులో పాఠశాల హెచ్‌ఎం వెంకటన్న, ఉపాధ్యాయులు ప్రభాకర్, శ్రీనివాసులు, రామన్ గౌడ్, పాండు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

గ్రూప్- వన్ టాపర్‌కు నాయకుల సన్మానం

కొత్తకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెవాటకి చెందిన పుష్పలత, వెంకటస్వామి కుమారుడు మండ్ల పవన్ కుమార్ గ్రూప్- వన్ ఫలితాల్లో 510 మార్కులతో రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వాల్మీకి సంఘం నాయకులు పవన్ కుమార్ ఇంటికెళ్లి శాలువాతో సన్మానించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి, ఉన్నత అధికారిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. సన్మానం చేసిన వారిలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వామన్‌గౌడ్, డాక్టర్ పీజే. బాబు, మాజీ ఎంపీపీ మౌనిక, బోయోజ్, కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, జేసీబీరాము, సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సాయిరెడ్డి, సుభాష్, కురుమూర్తి, చెన్నకేశవరెడ్డి, భరత్ భూషణ్, అమరేందర్‌రెడ్డి, రామకృష్ణతో పాటు వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, అంజి, దేవేందర్, శివలింగం, దేవన్న తదితరులు ఉన్నారు.



పవన్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

బాల్య వివాహాలను నిర్మూలించాలి

గోపాల్‌పేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిర్మూలించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి చెందిన లక్ష్మమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ తిలక్ కుమార్, ఎస్ఐ నరేష్ కుమార్ చేతుల మీదుగా బాల్య వివాహాల నిర్మూలన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలో బాల్య వివాహాలు లేకుండా చూడాలన్నారు.



బాల్య వివాహాల నిర్మూలన కరపత్రం విడుదల చేస్తున్న అధికారులు

వికలాంగుల హక్కుల సాధనకు ఉద్యమం

పాన్‌గల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో పెన్షన్ పెంపు కోసం నిధులు కేటాయించాలని, అలాగే వికలాంగుల హక్కులకు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్‌పీఆర్‌డీ మండల అధ్యక్షుడు బంగారయ్య అన్నారు. బుధవారం మండలంలోని గోప్లాపూర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ మండల పరిషత్ జిల్లా పరిషత్‌లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గోప్లాపూర్‌లో సంతకాలు తీసుకుంటున్న నాయకులు

అవినీతికి పాల్పడిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

పెబ్బేరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాలకు పాల్పడుతన్న పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచాల యుగేంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పెబ్బేరు ఎస్ఐ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, అతనిపై విచారణ జరపాలని హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పెబ్బేరు మండలం ఎస్ఐ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. గతేడాది ఏప్రిల్ 1న వ్యవసాయ గోదాంలో ప్రమాదం జరిగి ప్రభుత్వానికి దాదాపు రూ.10 కోట్ల వరకు నష్టం జరిగినా.. పట్టించుకోకుండా నిందితులకు అండగా నిలిచాడన్నారు. అతను చేపట్టిన అవినీతి అక్రమాల ఆధారాలు డీజీపీకి అందజేశామన్నారు. విచారణ చేపట్టి, అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పాత చిరు వ్యాపారులకే అడ్డాలు కేటాయించాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ ప్రహరీ వెంట 40 ఏళ్లుగా జీవిస్తున్న చిరు వ్యాపారులకే మళ్లీ ఆ స్థలాన్ని ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోడ్డు వెడల్పు సందర్భంగా ఇక్కడ ఉన్న చిరు వ్యాపారులను బలవంతంగా వెళ్లగొట్టారన్నారు. బాలస్వామి, గట్టయ్య, బీసన్న, రాములు, భాస్కర్, రామస్వామి, బాలేసాబ్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంతో ఐసీడీఎస్ నిర్వీర్యం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా విధానం తీసుకొచ్చి ఐసీడీఎస్, ఐటీసీని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. ఈ విధానం ద్వారా ఐసీడీఎస్ స్వతంత్రత కోల్పోతుందన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వనపర్తి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన విద్యా విధానం ప్రకారం ఐసీడీఎస్‌లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, ఆ వ్యవస్థ మూతపడే పరిస్థితికి వస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 17, 18వ తేదీల్లో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఐటీయూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, నారాయణమ్మ, నాగేం ద్రమ్మ, రాజేశ్వరి, శారద, రేణుక, లత, రామ చంద్రమ్మ, సంగీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు